## ముగిసిన జాతీయ కార్యాచరణ

**ప్రజాశక్తి - కడప**

ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) కడప, వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ స్టార్ట్ స్టేటస్ ప్రోగ్రాంలో భాగంగా హెర్బెరి విధానాలపై జాతీయ కార్యాచరణ కార్యక్రమం రెండవ రోజు గురువారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైవీయూ ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి హాజరై విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. విద్యార్థిని విద్యార్థులు రెండు రోజులపాటు వారు నేర్చుకున్న అంశాల గురించి అభిప్రాయాల్ని తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వృక్ష శాస్త్ర విభాగానికి, డిఆపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ స్టార్ స్టేటస్ ప్రోగ్రాం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ సురేష్ బాబు, కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, తిలక్ విద్యాసాగర్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

# శిక్షణల పేరుతో ప్రాణాలు బలిగొంటారా? : యుటిఎఫ్

**ప్రజాశక్తి- కడప అర్బన్**

శిక్షణల పేరుతో ఉపాధ్యాయుల ప్రాణాలను బలిగొంటారా అని రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల తీరుపై యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు ప్రశ్నించారు. . లీడర్షిప్ రెసిడెన్షియల్ శిక్షణా తరగతులలో ఇద్దరు ప్రధానోపాధ్యాయులు మరణించడం పట్ల, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని, విద్యాశాఖ అధికారుల తీరును నిరసిస్తూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం డిఇఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీడర్షిప్ ట్రైనింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణలను ఏర్పాటుచేసి తీవ్ర ఒత్తిడిలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వేసవి సెలవులలో ఇవ్వాల్సిన శిక్షణలను విద్యా సంవత్సరం మధ్యలో ఏర్పాటు చేయడమే కాకుండా ఉపాధ్యాయులు కచ్చితంగా రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ పొందాలని అడ్డగోలు నిబంధనలను విధించి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రెసిడెన్షియల్ శిక్షణ కేంద్రాలలో సరైన వసతులను ప్రభుత్వం కల్పించడంలో వైఫల్యం చెందిందని ఆరోపించారు. శిక్షణా కేంద్రాలలో సరైన సౌకర్యాలు లేక, అనారోగ్యాలతో ఉన్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల వైఖరి వల్ల ఉపాధ్యాయులు తమ ప్రాణాలను పోగొట్టుకోవాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మొదటి విడత శిక్షణలో భాగంగా ఏలూరు జిల్లాలోని అగిరిపల్లె శిక్షణా కేంద్రంలో టి.వి.రత్న కుమార్ అనే ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించగా, రెండవ విడత శిక్షణలో భాగంగా విజయనగరం జిల్లా, గజపతినగరంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో ఈరోజు సిరిపురం శ్రీనివాసరావు అనే మరో ప్రధానోపాధ్యాయుడు ఒత్తిడికి లోనై గుండెపోటుతో మరణించాడని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల మరణానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందో, విద్యాశాఖ అధికారులు బాధ్యత వహిస్తారో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మృతి చెందిన ప్రధానోపాధ్యాయులకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. రెసిడెన్షియల్ శిక్షణను తక్షణమే రద్దు చేయకపోతే పోరుబాట పట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, నాయకులు సుబ్బారావు, వీరనారాయణ, శివకుమార్ రాజు, సూర్య కుమార్, గోపినాథ్, సుబ్బారెడ్డి, రామ కేశవ, హిపాజత్తుల్లా, అబ్దుల్ ఘని, శివశంకర్ పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

# గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

## - రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్/ఒంటిమిట్ట**

రాష్ట్ర వ్యాప్తంగా గోతులు పడిన రహదారులకు మరమ్మతులు చేపట్టి గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రాజంపేట, ఒంటిమిట్ట పరిధిలో గుంతల రోడ్లను పరిశీలించారు. తొలుత రాజంపేట ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఒంటిమిట్ట మండలం మలకాటిపల్లెలో పాట్‌హోల్ ఫ్రీ ఎపి కార్యక్రమం (గుంతల రహిత రోడ్ల)లో భాగంగా ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి మంత్రి రోడ్ల మరమ్మతు పనులను పర్యవేక్షించారు. అనంతరం రూ.4.9 లక్షలతో మల్లకాటిపల్లి నుండి బెస్తవారిపల్లి వరకు 11 కిలోమీటర్ల మేర చేపట్టిన రహదారుల మరమ్మతుల పనులను ప్యాచ్ వర్క్ పనుల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి నాటికల్లా గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా రహదారుల మరమ్మతుల పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో రహదారులన్నీ గుంతలమయంగా మారడంతో, ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర రహదారుల మరమ్మతుల పునర్నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.860 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రోడ్లు, భవనాల, పరిశ్రమల, పర్యాటక శాఖలను, వ్యవస్థలన్నిటిని నిర్వీర్యం చేశారని వాటిని గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు అందరూ నష్టపోయారన్నారు. పిపిపి మోడల్‌లో రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల అభివృద్ధి కోసం రూ.3 వేల కోట్లు వెచ్చించనున్నామని తెలిపారు. భారత్ మాల కార్యక్రమంలో భాగంగా రూ.28 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా మొత్తంగా దాదాపుగా రాష్ట్రంలో రహదారులన్నింటికీ రూ.70 వేల కోట్లతో మరమ్మతులు, అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నారన్నారు. మొదటగా వృద్ధాప్య పెన్షన్లను రూ.4000కి పెంచి ఒకటో తేదీన ఇంటింటికి పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లను దీపావళి నుంచి మొదటి విడతగా మంజూరు చేయడం జరిగిందన్నారు. దశలవారీగా ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రజలందరికీ అందివ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొదటి దశలో 110 పనులకు గాను జిల్లాకు రూ.15.97 కోట్లు నియోజకవర్గాల వారిగా మంజూరు చేశామన్నారు. 657.635 కిలోమీటర్లు మేర రహదారుల్లో గుంతలను పూడ్చడం జరుగుతుందని తెలిపారు ఇప్పటివరకు 15 శాతం పనులు పూర్తి అయ్యాయని డిసెంబర్ చివరినాటికి పనులన్నీ పూర్తవుతాయని తెలిపారు. రెండో దశలో 169 పనులకు గాను రూ.22.08 కోట్లు మంజూరు చేశామన్నారు. 830.47 కిలోమీటర్ల మేర రహదారులకు ఏర్పడిన గుంతలను పూరుస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పిలిచామని తెలిపారు. వచ్చే సంక్రాంతి లోపల పూర్తి చేసి గుంతల రహిత రాష్ట్రంగా మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, కడప ఆర్‌అండ్‌బి ఇఇలు నాగేశ్వరరెడ్డి, మాధవి, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వెంకటపతి, డిఇ షేక్ షావలి, ఎఇ గంగిరెడ్డి, ఒంటిమిట్ట తహశీల్దార్ రమణమ్మ, టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల అధ్యక్షులు నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, కల్లుగీత కార్మిక మాజీ డైరెక్టర్ వెంకట నరసయ్య పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

# గొప్ప కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి

## - కేంద్ర సాహిత్య అకాడమీ సభలో ఆచార్య పి.పద్మ

**ప్రజాశక్తి - కడప అర్బన్**

అభ్యుదయ రచయితగా రైతులు, పేదలు, పీడితుల పక్షాన నిలిచిన గొప్ప కథారచయిత కేతు విశ్వనాథరెడ్డి అని రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అన్నారు. గురువారం వైవీయూ, కేంద్ర సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బిల్డింగ్‌లోని కవయిత్రి మొల్ల సమావేశ మందిరంలో ప్రసిద్ధ తెలుగు రచయిత కేతు విశ్వనాథ రెడ్డి జీవితం, రచనలపై 'నా దృష్టిలో..' పేరుతో సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. సాహిత్య అకాడమీ సభ్యులు వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు ఎం.ఎం.వినోదిని అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభకు ముఖ్య అతిథిగా ఆచార్య పద్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాహిత్య అకాడమీ దేశంలోని 24 భాషల అభివృద్ధికి కృషిచేస్తోందన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతోందని గుర్తు చేశారు. పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ రైతుల దుర్భర జీవితం వారి ఆకలి బాధలు కేతు విశ్వనాథరెడ్డి రచనల్లో కనిపిస్తాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ప్రసిద్ధ తెలుగు రచయిత్రి ఆచార్య కాత్యాయనీ విద్మహే కీలక ఉపన్యాసం చేస్తూ వర్తమాన సామాజిక దుర్మార్గాలను సాంస్కృతిక కోణం నుంచి ఎదుర్కొన్న రచయిత కేతు విశ్వనాథ రెడ్డి తెలిపారు. కులమత అసంబద్ధాలు, అపోహలు తొలగిపోవాలంటే ఆయన కథలు చదవాలన్నారు. వర్తమాన సమాజానికి అవసరమైన లౌకిక ప్రజాస్వామ్య భావనలు కలిగిన కథా రచయిత కేతు అన్నారు. విశ్వనాథరెడ్డి తోటి విద్యార్థులతో స్నేహంగా మెలుగుతూ జ్ఞానచైతన్యం చేసేవారన్నారు. మార్క్సిస్టు దృక్పథం కలిగిన అభ్యుదయ వాది ఆచార్య కేతు అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, తెలుగుశాఖ ఆచార్యులు రమాదేవి, కవిత విద్య సాంస్కృతిక సేవ సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్య చౌదరి, ఆచార్య కృష్ణ కుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆచార్య పి. పద్మ

# ఎర్రజెండాతోనే అభివృద్ధి సాధ్యం : సిపిఎం

**ప్రజాశక్తి-పోరుమామిళ్ల (కాశినాయన)**

గ్రామస్థాయి నుంచి దేశ రాజధాని వరకు ఎర్రజెండాతోనే పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని, వారిని మోసం చేసే ప్రభుత్వాలకు ఎప్పటికీ పతనమే అని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు గురువారం పోరుమామిళ్ల పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలను మోసం చేసే ప్రభుత్వాలను నమ్మొద్దని పేర్కొన్నారు. వెలుగొండ, వామి కొండ సర్వరాయ సాగర్ ప్రాజెక్టుల పూర్తి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలన్నారు. కడప కరువు కొప్పర్తి ఎంఎస్ఇఎం, మెడికల్ కళాశాల 50 సీట్లు, ఉక్కు ఫ్యాక్టరీలపై వివక్షత వీడనాడాలన్నారు. బిజెపి హిందుత్వానికి ప్రత్యామ్నాయం లౌకికవాదం అన్నారు. దళిత క్రిస్టియన్లకు రిజర్వేషన్లు తేవాలని ఆయన కోరారు. ప్రజలు కూటమికి 235 సీట్లు ఇస్తే వారికి ఒరిగింది ఏమీ లేదు అన్నారు. స్టీల్ ప్లాంట్‌కు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేయడమే తప్ప, పనులు మొదలుపెట్టి ప్రజల కోసం చేసింది ఏమీ లేదని వాపోయారు. మొన్న జరిగిన బడ్జెట్ సమావేశాలలో స్టీల్ ఫ్యాక్టరీ ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లాలోని 36 మండలాల గాను కనీసం ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం చాలా దారుణమని పేర్కొన్నారు. పోరుమామిళ్లకు సంబంధించిన చెరువు చాలా పెద్దదని, దానిని రిజర్వాయర్‌గా గుర్తించాలని, ఎన్నో పర్యాయములు ప్రభుత్వాల దృష్టికి తెచ్చామన్నారు. కానీ ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం వల్ల అది అలానే ఉందన్నారు. ఈ ప్రాంతంలో సిక్స్ లైన్ రోడ్లు వేస్తున్నారని, దీని వల్ల రైతులు ఎంతో భూములు కోల్పోయారని, వారికి డబ్బులు కూడా ఇవ్వడం లేదన్నారు. వెంటనే నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు కలసపాడు, కాసినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు ప్రాంతాల రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మండలాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఎ.రామ్మోహన్, మండల కార్యదర్శి భైరవ ప్రసాద్, సిపిఎం కార్మికులు, అనేకమంది పాల్గొన్నారు.

# కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

తలపడుతున్న అనంతపురం, రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్లు

**ప్రజాశక్తి - కడప**

అండర్- 23 వన్డే ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంటులో భాగంగా గురువారం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జట్టుపై ఐదు వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి జట్టు ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రకాశం జిల్లా జట్టు 46.2 ఓవర్లలో 286 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రోహిత్ 77, అభినవ్ 92 పరుగులు చేశారు. ఈస్ట్ గోదావరి జట్టులోని శివ 4, వంశీ నారాయణ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 287 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 47.4 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసి ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని సాయి శ్రవణ్ బ్యాటింగ్లో అద్భుతంగా రానించి 151 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. పాండురంగరాజు 37 పరుగులు చేశాడు. ప్రకాశం జట్టులోని నవీన్ 2, పార్థసారథి 2 వికెట్లు తీసుకున్నారు.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో అనంతపురం జట్టుపై 26 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 50.0 ఓవర్లలో 203 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రాజు 56, స్వామి నాయుడు 43 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దత్తారెడ్డి 3, లోహిత్ సాయి 2, దీపక్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 204 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 37.2 ఓవర్లలో 176 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని యోగానంద 46, జయ కృష్ణ 37 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని మానస్ నాలుగు, సుశాంత్ నాయుడు వికెట్లు తీసుకున్నారు.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 50.0 ఓవర్లలో 8 వికెట్లను నష్టానికి 294 పరుగులు చేసింది. ఆ జట్టులోని హర్షవర్ధన్ 63, సాయి పూర్ణ తేజ 55 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని అఖిల్ 3, సాకేత్రామ్ 2, మాధవ్ 2 టికెట్లు తీసుకున్నారు. అనంతరం 295 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 45.2 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ చెట్టులోని రేవంత్ రెడ్డి 131 పరుగులు (సెంచరీ) చేశాడు. నిఖిలేష్ 54 పరుగులు చేశాడు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

## రిమ్స్ వైద్యుల సంఘం అధ్యక్షులుగా డాక్టర్ ఫరూక్

**ప్రజాశక్తి- కడప అర్బన్**

రిమ్స్ వైద్యుల సంఘం అధ్యక్షులుగా డాక్టర్ ఫరూక్ ఎన్నికయ్యారు. ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబ్జీ శ్యామ్ కుమార్ పర్య వేక్షణలో నిర్వహించారు. అధ్యక్షులుగా ఇఎన్‌టి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫరూక్, కార్యదర్శిగా ఎస్‌పిఎం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బరాయుడు, కోశాధికారిగా జనరల్ సర్జన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డితో కూడిన కారుదర్శివర్గం ఏకగ్రీవం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నూకరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్య వర్గ సభ్యులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను కార్యవర్గ సభ్యులను అభినందించారు.

అల్‌షిఫా మానసిక వికలాంగుల కేంద్రంలో విద్యుత్ ఎస్ఇ రమణ

## నిత్యావసరాలు పంపిణీ

**ప్రజాశక్తి - కడప**

కడప నగరం పాత రిమ్స్‌లో అల్ షిఫా వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక విభిన్న ప్రతిభావంతుల పునరావాస కేంద్రానికి కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం తరఫున గురువారం రూ. 50 వేలు విలువచేసే నెలసరి నిత్యావసర సరుకులను జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల పట్ల ఎంతో ఓపికగా ఓర్పుతో ఉండాలని సూచించారు. ఇంతమంది మానసిక పిల్లలను అక్కున చేర్చుకున్న అలీషిఫా వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని ప్రతి ఒక్కరు తమకు వీలైనంత సాయం చేసి మానసిక దివ్యాంగుల కేంద్రాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం జనరల్ సెక్రెటరీ చలపతి, ఫయాజ్ బేగ్, కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిసేవ్య నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగశేషా రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు. **ఖాజీపేట :** మండల పరిధిలోని చెముళ్ళ పల్లె సమీపంలోని మూలపాక వద్ద లారెన్స్ వృద్ధాశ్రమా నికి విద్యుత్ ఎస్ఇ ఎస్. రమణ, కడప విద్యుత్ ఉద్యోగుల సామా జిక సేవా సంఘం తరఫున రూ. 40 వేలు విలువైన నిత్యవసర సరుకులను ఆశ్రమ నిర్వాహకుడు చెన్నయ్యకు అంద జేశారు. కార్యక్ర మంలో జనరల్ సెక్రెటరీ చలపతి, ఫయాజ్ బేగ్, మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్లు భద్రయ్య నాగరాజు విజయ్ పాల్గొన్నారు. **స్నేహాలయ నిరాశ్రయుల వసతి గృహంలో..** స్థానిక ప్రకాష్ నగర్ కాలనీలో ఉన్న స్నేహాలయ నిరాశయుల గృహంలో కడప నగరం హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ గీత ఆధ్వర్యంలో గురువారం పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎజిఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ వృద్ధులు మనకు నీడనిచ్చే వృక్షాలు అన్న భావనతో కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. వృద్ధులకు వసతిని కల్పించి వారికి అండగా నిలబడిన స్నేహాలయ నిరాశ్రయుల వసతి గృహ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపల్ గీత, ఏజిఎం కిరణ్ కుమార్లు విద్యార్థుల చేతుల మీదుగా పండ్లు, మిఠాయిలు ఆశ్రవ ంలోని వృద్ధులకు అందజేశారు. కార్యక్రమంలో స్నేహాలయ నిరాశ్రయాల గృహం యాజమాన్యం, నారాయణ స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్ షిఫా కేంద్రాన్ని సందర్శించిన నారాయణ విద్యార్థులు

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** పాత రిమ్స్‌లో ఉన్న అల్ షిఫా మానసిక దివ్యాంగ పునరావాస కేంద్రాన్ని నారాయణ ఇంగ్లీష్ మీడియాట స్కూల్ లో నర్సరీ, ఎల్‌కెజి యూకేజీ చదువుతున్న చిన్నారులు వాళ్ళ తల్లిదండ్రులు, నారాయణ సిబంది గురువారం సందర్శించారు. ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నటువంటి పిల్లలందరికీ ఎంతో సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ఎజిఎం చెన్నకేశవరాజు మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా సహకార అందించాలని పేర్కొన్నారు. ఆర్ఐ రామకృష్ణ శర్మ మాట్లాడుతూ గతంలో తమ స్కూల్స్ నుంచి కూడా పిల్లు, తల్లిదండ్రులు, యాజమాన్యం సహకారం తో అనాథ పిల్లలకూ కావాల్సిన సహాయ సహకారం అందించామని చెప్పారు. భవిష్యత్తులో సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ కల్పన మాట్లాడుతూ మానసిక వికలాంగులకు సాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ రవికాంత్, కోఆర్డినేటర్ షబానా, వైస్ ప్రిన్సిపల్ సాజిదా, అల్ షిఫా మహమ్మద్ రఫీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కెవికి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి- కడప అర్బన్**

నగర శివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న కేంద్రీయ విద్యాలయానికి విద్యార్థుల సౌకర్యార్థం కనీసం 10 బస్సులు ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్-4 విజయవాడ, కె.వి పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు మైల జనార్దన్ కోరారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయంలో దాదాపు 800 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. బస్సులో వెళ్లి పరిశీలించగా 55 మంది కూర్చోవాల్సిన సీటింగ్‌లో 80 మందికి పైగా ప్రయాణిస్తూ ఉన్నారని తెలిపారు. బ్యాగులతోపాటు వారు ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలో తమ పిల్లలు కూడా చదువుతూ ఉన్నారని తెలిపారు. కేంద్రీయ విద్యాలయ చైర్మన్, కలెక్టర్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ విద్యార్థి విభాగం నాయకులు రంపతాటి. నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనార్ధన్

## సమస్యలను డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావాలి

**ప్రజాశక్తి - కడప**

ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి, పులివెందుల మండల న్యాయ సమితి దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం జడ్జి పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూపరిండెంట్, ఖైదీలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) జిల్లా కోశాధికారి గోపి కోరారు. గురువారం ఎమ్మెల్యే, విప్ మాధవికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గత ప్రభుత్వంలో విభజించు పాలించు అనే విధంగా 2023, డిసెంబర్ 24 నుంచి 16 రోజులు సమ్మె చేస్తే పారిశుధ్య కార్మికులకు పెంచి ఇంజినీరింగ్ కార్మికులకు పెంచకుండా అన్యాయం చేసిందని తెలిపారు. సమ్మె కాలంలో టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి తమకు మద్దతుగా వచ్చారని చెప్పారు. ఇంజినీరింగ్ విభాగంలో ఉన్న వారికి కేడర్ ఉన్నా అప్కాస్‌లో మారడం లేదని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న జిఒను ఇంజినీరింగ్ కార్మికులకు కూడా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, సహాయ కార్యదర్శి ఎం.ఆనందరవు, కె.సుబ్బయ్య. కె.ఆంజనేయులు, శ్యాం బాబు, ఎం.నారాయణ. ఎం. సుబ్బారాయుడు, గురువయ్య, చెంద్రాయుడు, బాల గంగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

## గోశాల పరిశీలన

**ప్రజాశక్తి - కడప అర్బన్**

బుగ్గ అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన గోశాలను మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి పరిశీలించారు. గురువారం బుగ్గ అగ్రహారం వద్ద బుగ్గ మల్లేశ్వరస్వామి దేవస్థానం వద్ద కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులకు కావాలసిన అన్ని సౌకర్యాలతో గోశాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గోవులకు అవసమైన ఆహారాన్ని అందించేందుకు సంరక్షకులు 12 మంది సిబ్బందితో పని చేస్తున్నారని తెలిపారు. ఇద్దరు వెటర్నరీ అసిస్టెంట్లు అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఇప్పటికీ నగరంలో రోడ్ల పైన తిరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. గోవులు రోడ్లమీద తిరిగితే ప్రమాదాలకు గురవుతాయని చెప్పారు. గోవుల ప్రమాదాలకు గురికాకుండా ఉండాలంటే గోశాలకు తరలించడమే మంచిదన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీరాములు, వెటర్నరీ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిడిఒగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - ఒంటిమిట్ట**

ఎంపిడిఒగా పనిచేస్తున్న సోమశేఖర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానిలో ఎంపిడిఒ కార్యాలయంలో విస్తరణ అధికారిగా పని చేస్తున్న కెఆర్ఎం ప్రసాద్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేస్తున్న సోమశేఖర్ పైన కొన్ని అభియోగాలు రావడంతో ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఎంపిడిఒ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, అధికారులందరిని సమన్వయ చేసుకొని ప్రజల అభివృద్ధికి పాటుపడతారని పేర్కొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాశక్తి -మైదుకూరు(చాపాడు) :** మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణరెడ్డి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధ్యాపకులకు సైబర్ నేరాలు - బెదిరింపులు, సామాజిక మాధ్యమాలలో మొబైల్ దుర్వినియోగం అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ జ్వాల నరసింహ శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయ శాస్త్రంలో గల వివిధ నియమ నిబంధనలను, సెక్షన్లపై అవగాహన కలిగించారు. సమాజంలో జరుగుతున్న అనేక ప్రముఖ వ్యక్తులు సైబర్ నేరాల పట్ల నిర్లక్ష్యంగా ఉండటం వల్ల వేలాది రూపాయలను పోగొట్టుకోవడం అవగాహన రాహిత్యమన్నారు. విద్యార్థులు ముఖ్యంగా ఇలాంటి సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి తమ తల్లిదండ్రులకు, గ్రామ ప్రజలకు అప్రమస్తం చేయవలసిన అవసరం విద్యార్థుల పైన ఎంతగానో ఉందన్నారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ శేషగిరి రావు మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగినప్పుడు తక్షణమే పోలీస్ శాఖను సంప్రదించాలని తెలిపారు. డిజిటల్ అరెస్ట్, రైతు భరోసా ఏపీకే, ఇండియన్ పోస్ట్ డాట్ కామ్ లాంటి వెబ్‌సైట్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంబంధం లేనటువంటి ట్రాన్సక్షన్లకు ఒటిపిలు చెప్పటం చేయకూడదని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, జంతుశాస్త్రధ్యాపకులు నరసింహారావు, సుబ్బరాయుడు, రామేశ్వర్ రెడ్డి, నవనీశ్వర రెడ్డి ,అనురాధ, లక్ష్మి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇ-పంట నమోదు తప్పనిసరి

**ప్రజాశక్తి - లింగాల :** రబీలో సాగు చేసిన ప్రతి పంటను ఆన్‌లైన్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ అన్నారు. ఈ మేరకు ఆయన మండల పరిధిలోని ఇప్పట్లలో జరుగుతున్న ఈ పంట నమోదు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు .అనంతరం మాట్లాడుతూ మండల పరిధిలో సుమారు 4500 హెక్టార్లలో వ్యవసాయ , ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయన్నారు సిబ్బంది ఎటువంటి అవకతవకులకు పాల్పడకుండా పంటలు నమోదు చేయాలన్నారు. డివిజన్ , జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షిస్తారని ఏవైనా వ్యత్యాసం కనిపిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంట బీమా ఆధారంగా నష్టపరిహారం, వడ్డీ లేని పంట రుణాలు మొదలైన పథకాలకు అర్హులవుతారన్నారు. శనగ, వేరుశనగ, మినుము ,పెసర, జొన్న, వరి, పొద్దుతిరుగుడు, నువ్వులు సాగు చేసిన రైతులకు పంట బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవ సిబ్బంది హరిశిల్ప, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికీ స్క్రీనింగ్ పరీక్షలు

**ప్రజాశక్తి - ముద్దనూరు :** విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసేందుకు సులువుగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీకాంత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఎత్తు, బరువు, రక్త పరీక్షలు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వారికి ఇచ్చిన గుర్తింపు కార్డులో వివరాలు నమోదు చేయాలన్నారు. దీంతో విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేసేందుకు సులభంగా ఉంటుందన్నారు. ఈనెల లోపు విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు చంద్రాబాయి, సుబ్బలక్షుమ్మ, ఉమా పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

## ఎస్ఆర్ఐటి విద్యార్థులకు ఉద్యోగాలు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్ )**

సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల బి.టెక్ ఫైనలియర్ విద్యార్థులు చెన్నైకి చెందిన వర్కుహాల్ సొల్యుషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఆల్‌ఇంజనీర్-3, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ 12 మొత్తం 15 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పాండురంగన్ మాట్లాడుతూ ఇఇలో సుప్రియ, సుమంత్,మాలిక్ బాషా, ఇసిఇలో సురేష్, రాజేశ్వర్ రెడ్డి, సిఎస్ఇలో శిరీష, మధు, కార్తీక్, ఉదయ్ మహేష్, ముఖేష్, గణేష్ గోవర్ధన్ యాదవ్, సమర్పిన్, అంజలి, అన్ను ఎంపికయ్యారన్నారు. వీరికి ఏడాదికి రూ. 3 నుండి రూ. 4 లక్షల వేతనం ఇస్తారని టిపిఒ సునీల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఒడిలు అభినందించారు.

## కస్తూర్బా పాఠశాలకు బీరువాలు వితరణ

**ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్ :** నియోజకవర్గ పరిధిలోని పెద్దముడియం మండలం పెద్ద పసుపులలో ఉన్న కస్తూరిబా హైస్కూల్‌కు జమ్మలమడుగు పట్టణానికి చెందిన లైసెన్స్ మున్సిపల్ సర్వేయర్ గొందిపల్లి సంజీవరాయుడు రూ. 30, 000 విలువ చేసే రెండు బీరువాలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ చింతకాయల చౌడయ్య మాట్లాడుతూ దాతలు కస్తూర్బా హై స్కూల్‌కు ఉపాధ్యాయుల అవసరాల కోసం ర్యాకులు గల రెండు బీరువాలు అందజేయడం సంతోషించితగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా దాతను పెద్దపసుపుల జడ్‌పి హైస్కూల్ హెచ్ఎం, కస్తూరి భా బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ మౌనిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస రెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.

## లింగ వివక్షతను నిర్మూలించాలి

**ప్రజాశక్తి - ముద్దనూరు :** లింగ వివక్షత నిర్మూలించి ఆడ, మగ సమానంగా చూడాలని ఎంపిడిఒ ముకుందారెడ్డి, సిడిపిఒ ముంతాజ్ బేగం అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా కిశోరి వికాసంపై గురువారం ముకుందారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి మహిళలు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా నిలిచి ప్రతిజ్ఞ చేశారు. ఎపిఎం అపర్ణ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాంక్ ఖాతా అవసరం లేదు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్ ) :** మహిళా పథకాలకు పోస్టల్ బ్యాంక్ అకౌంట్ అవసరం లేదని, ప్రభుత్వ పథకాలకు బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింకు ఉంటే సరిపోతుందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో పలువురు పోస్ట్ ఆఫీస్‌లో 200 పెట్టి అకౌంటు ఓపెన్ చేసుకుంటేనే సూపర్ సిక్స్ పథకంలో భాగంగా మహిళలకు రూ.1500 పడతాయని ప్రచారం జరుగుతూ ఉందని, ఇది సరి కాదని పేర్కొన్నారు. బ్యాంక్ అకౌంట్ కి ఆధార్ లింక్ ఉంటే చాలని తెలిపారు. ఇలాంటి అసత్య ప్రచారాలను చేస్తున్న వారి విషయంలో పోలీస్ డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవాలని కోరారు.

## జిగర్ తాండా ఐస్ క్రీమ్ పార్లర్ ప్రారంభం

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** నగరంలోని రాజీవ్ పార్క్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన మధురై ఫేమస్ జిగర్ తండా ఐస్ క్రీమ్ పార్లర్‌ను గురువారం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధికి ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. రాజీవ్ మార్గ్ రోడ్డులో సందడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గురువారం ప్రొప్రైటర్ జాకీర్, టిడిపి నగర ఉపాధ్యక్షులు పఠాన్ మన్సూర్ అలీ ఖాన్, జెకె యూత్ ఖాదర్ బాషా, జాకీర్ కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఐస్ క్రీమ్ పార్లర్‌ను ప్రారంభిస్తున్న విప్, ఎమ్మెల్యే మాధవి

# అందరికీ ఆదర్శం జ్యోతిరావు పూలే : జెసి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

అందరికీ ఆదర్శం జ్యోతిరావు పూలే అని జెసి అదితిసింగ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని విజిలెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలోపూలే వర్ధంతి సభ నిర్వహించారు. పూలే 134వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సామాన్య జీవితంతో అసాధారణంగా కృషి చేసిన పూలే వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి అన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలను, దోపిడీ వ్యవస్థ, అంటరాని తనం నుంచి విముక్తి చేయడానికి నిరంతరం కృషిచేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. అహంకారం, ఆధిపత్యం, అజ్ఞానం, అంధకారం అంటే గిట్టని జ్యోతి రావు పూలే అందరి ఆనందాన్ని కోరే ఆశావాది, ఆశాజ్యోతి అన్నారు. సమాన హక్కుల కోసం, కులవ్యవస్థ నిర్మూలన, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. సామాజిక పరిణామ మార్పులకు, సంఘ సంస్కరణలకు తండ్రి లాంటి వారు పూలే అని పేర్కొన్నారు. కుల వ్యవస్థను రూపుమాపడంలో ప్రతి ఒక్కరూ ఆర్థికం, రాజకీయంగా ఉన్నతంగా అభివృద్ధి చెందినపుడే సార్థకమవుతుందన్నారు. వీటన్నింటిని అధిగమించాలంటే ఒక్క విద్య వల్లనే సాధ్యం అవుతుందని అనుభవ పూర్వకంగా గ్రహించిన అధ్యయనకర్త జ్యోతిరావు పూలే అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జ్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కృష్ణయ్య, కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, కార్యాలయ సిబ్బంది, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

**సామాజిక ఉద్యమకారుడు పూలే : డివైఎఫ్ఐ**

సమాజంలో అంటరానితనం కోసం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం బడుగు, బలహీన వర్గాల కోసం అనునిత్యం పోరాడిన సామాజిక ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరబాల శివకుమార్ తెలిపారు. పూలే వర్ధంతి సందర్భంగా కడప ప్రభుత్వ పాలిటెక్నిక్ శిక్షణ సంస్థలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీతో పాటు మహాత్మా అని పిలుచుకునే గొప్ప వ్యక్తి దేశంలో ఒక్క పూలే అన్నారు. సేవలు నిత్యం ఒక సామాజిక దృక్పథంతో ఉండేవన్నారు. పూలే బాలికల కోసం దేశంలో మొట్టమొదటి సారిగా బాలిక లకు చదువు పురుషులతో సమానంగా అందాలని పాఠశాల ప్రారంభించిన గొప్ప మహోన్నతుడు పూలే అన్నారు. కార్యక్రమంలో జయవర్ధన్, వేణు, పవన్, నిత్య పూజ, యాదాద్రి, నవీన్, సురేంద్ర, మౌలాలి, ఖాదర్ వలీ పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిబా పూలే అందరికి ఆదర్శప్రాయుడని,టిడిపి సీనియర్ నాయకులు అలంఖాన్ పల్లె లక్ష్మిరెడ్డి అన్నారు. గురు వారం విజయ వాడలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో పూలే విగ్రహానికి నివాళులర్పించారు. సమాజంలో కుల వివక్షకు వ్యతిరేకంగా పేద, అణగారిన, అంటరాని ప్రజల హక్కుల కోసం పోరాడిన సంఘసంస్కర్త 'మహాత్మ జ్యోతి రావు అన్నారు. భావితరాలు ఆయన ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**కడప:** ఆదర్శప్రాయుడు జ్యోతిరావు పూలే అని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్ల విజయ జ్యోతి అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, చిన్న కుళ్లాయప్ప, సయ్యద్ సలావుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, మామిళ్ళ బాబు, గౌస్ పీర్, పి.డి. సంజయ్ కాంత, హరి ప్రసాద్, గఫార్, చందు, చక్రి, శ్రీకాంత్, ప్రదీప్ పాల్గొన్నారు.

జ్యోతిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెసి అదితిసింగ్

**వైసిపి జిల్లా కార్యాలయంలో..** మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, నగర మేయర్ సురేష్ బాబు, జడ్‌పిటిసి నరేన్ రామాంజుల రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శప్రాయుడని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, వైసిపి నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

**ముద్దనూరు :** స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం మండల కన్వీనర్ నడమల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, వెంకట్, ప్రతాప్, బాలయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

**జమ్మలమడుగు రూరల్ :** కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సింగం శివమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి, కార్యకర్తలు పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళు లు అర్పించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు పట్టణ అధ్యక్షులు పదముత్తో రాజేష్, పెద్దముడియం మండల అధ్యక్షులు రషీద్, మాజీ రాష్ట్ర ఎస్‌సి సెల్ జనరల్ సెక్రటరి వెంకటస్వామి, మాజీ రాష్ట్ర ఎస్‌సి సెల్ సెక్రటరీ ప్రకాశం, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్ :** మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపురంలోని వైఎస్ జగన్మోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మహాత్మజ్యోతిరావు పూలే చిత్రపటానికి మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్, జెసిఎస్ ఇన్‌ఛార్జి పార్నపల్లి కిషోర్ పూలమాలవేసి జోహార్ మహాత్మ జ్యోతిరావు పూలే జోహార్ అనే నినాదాలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణస్వామి, చంద్రమౌళి, పలువురు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా భిక్ష కాదు : పిసిసి

**ప్రజాశక్తి - వేంపల్లె :** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై బిజెపిది పలాయన వాదమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సంజీవని భిక్ష కాదు, హక్కు అని అన్నారు. ప్రత్యేక హోదా మౌఖిక హామీ మాత్రమే కాని రాత పూర్వక హామీ కాదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హైకోర్టులో వాదించడం సిగ్గు చేటు, పలాయన వాదమని వాపోయారు. 2014 ఫిబ్రవరి 20వ తేదీన ఆనాటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ రాజ్యసభలో ఆంధ్ర ప్రదేశ్‌కు 5 సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా అమలు చేస్తామని ప్రకటన చేయగా సభ ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తు చేశారు. 2014 మార్చి 1వ తేదీన కేంద్ర మంత్రి వర్గం రాతపూర్వకంగా తీర్మానం చేసి అమలు చేయమని ప్రణాళికా సంఘాన్ని ఆదేశించిందని తెలిపారు. బిజెపి అధికారంలోకి వస్తే మరో 5 ఏళ్ల పొడిగిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో రాత పూర్వకంగా పేర్కొందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు 10 ఏళ్లపాటు ప్రత్యేక హోదా అమలు చేస్తామని తిరుపతి ఎన్నికల సభలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి సాక్షిగా నరేంద్ర మోడీ చెప్పారని తెలిపారు. ఇప్పుడు రాతపూర్వక హామీ ఇవ్వలేదని సాకులు చెప్పడం సిగ్గు చేటు అన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన టిడిపి, జనసేన, వైసీపీ పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వుండడం శోచనీయం అన్నారు. కడప జిల్లాలో ఆర్‌టిపిపిలో బూడిద కోసం కూటమి నాయకుల మధ్య యుద్ధం ఇందుకు నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తులసిరెడ్డి సూచించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బ రాయుడు, వేమా రాజా, వెంకటేష్, మహబూబ్ బాషా, రమణ, నాగరాజు, రవి, మదార్, వినయ్ , వేమయ్య, బద్రి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే 'పుట్టా'కు చిత్రపటం బహూకరణ

**ప్రజాశక్తి -ఖాజీపేట :** మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్‌ను ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో ఖాజీపేట మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన చిత్రపటాన్ని సుధాకర్ యాదవ్‌కు జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని గ్రామస్తుల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సోహెల్, మాజీ జెడ్పిటిసి గోవిందరెడ్డి, కృష్ణ చైతన్యరెడ్డి, గంగిరెడ్డి(కిట్టు), నాయకులు పాల్గొన్నారు.

## దోమల నియంత్రణ మనందరి బాధ్యత

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్ :** దోమల నియంత్రణ మన అందరి బాధ్యత అని సబ్ యూనిట్ వైద్యాధికారి సిద్దయ్య అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని నగరిగుట్టలో ఇంటింటా ఫివర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారి చేసి, ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమములో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపుతలు సేకరించి వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు అందజేయాలని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారమూ తప్పని సరిగా డ్రైడే పాటించాలని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు ఎవ్వరికైనా జ్వరం వచ్చినట్లు అయితే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించాకోవాలని సిద్దయ్య అన్నారు. కార్యకమములో ఆరోగ్య కార్యకర్త చిలకమ్మ, ఆశా కార్యకర్తలు రామీజా, రామాంజులమ్మ పాల్గొన్నారు.

## ప్రజలే రెడ్ బుక్ రాస్తున్నారు : ఎమ్మెల్సీ

**ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్**

రాష్ట్రంలో జరిగే ప్రస్తుత పరిస్థితులను చూసి ప్రజలే కూటమి ప్రభుత్వంపై రెడ్ బుక్కును రాసే పనిలో ఉన్నారని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో కూటమి నాయకులు సంక్షేమ పథ కాలను అవహేళన చేసి ఎన్నికల సమయంలో మళ్లీ సూపర్ సిక్స్ పేరుతో వచ్చారన్నారు. అమ్మబడి, చేయూత, రైతు భరోసా, ఫీజు రియంబర్స్‌మెంట్ వంటి పథకాలను పేరు మార్చిన ఇప్పటికి కూటమి ప్రభుత్వం అమలు చేయ లేక పోతుందన్నారు. బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించలేదని, ఎప్పటి నుంచి అమలు చేస్తారో కూడా చెప్పలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ప్రజ లకు ఇచ్చిన మేనిఫెస్టోను సం పూర్ణంగా అమలు చేసిన ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభు త్వం పై ప్రజలకు నమ్మకం పోయి ందన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అధ్వానంగా ఉంద న్నారు. సమాజంలో మహి ళలను అవ మానపరిచేలా మాట్లాడే ఎవరినైనా శిక్షించాలని పేర్కొన్నారు.

## ఆర్‌టిపిపిలో కొనసాగుతున్న ఉత్కంఠ

**ప్రజాశక్తి-ఎర్రగుంట్ల :** ఆర్‌టిపిపిలో ఉత్కంఠ కొనసాగుతోంది. గురువారం పోలీసులు ఆర్‌టిపిపి పరిసరాల వద్ద భారీగా మోహరించారు. తాడిపత్రి వద్ద ఉన్న సిమెంట్ పరిశ్రమలకు ఫ్లయాష్ తరలించేందుకు జెసి ప్రభాకర్ రెడ్డి వాహ నాలు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డికి చెందిన వ్యక్తులు వెనక్కి పంపడంతో గొడవ మొదలయ్యింది. ' మేము వస్తాం.. అపితే గొడవలు అవుతాయి' అని జెసి.. 'ఎలా వస్తారో రండి ' అని ఆది గ్రూపునకు చెందిన వారు సవాళ్లు చేసుకోవడంతో ఆర్‌టిపిపిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు డిఎస్‌పి ఆధ్వర్యంలో వంద మంది పోలీసులతో భద్రతను పెంచారు. తహశీల్దారు భద్రత దృష్ట్యా 144 సెక్షన్ బుధ, గురువారాలు అమలు చేశారు. ఈ క్రమంలో జెసి ప్రభాకర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డికి సీఎంవో నుంచి పిలుపు వచ్చినట్లు సమాచారమం. శుక్రవారం సిఎం కార్యాలయానికి రావాలంటూ ఇద్దరు నేతలకు ఆదేశాలు తెలుస్తోంది. కొన్ని రోజులుగా ఇద్దరి నేతల మధ్య రగులుతున్న ఫ్లయాష్ వివాదం సిఎం ఆధ్వర్యంలో తెర దిగనుంది.

## వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

**ప్రజాశక్తి- పులివెందుల రూరల్ :** పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం గత ప్రభుత్వంలో రూ. 650 కోట్ల ఖర్చు చేసినా, పులివెందులలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలో లైట్లుకు, మోటర్ల మరమ్మతులు చేయాలంటే మున్సిపాలిటీలో డబ్బులు లేవని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో సిమెంట్ రోడు, అండర్ డ్రైయినేజీ పనులు చేసుకోకుండా ఎన్‌డిఎ కూటమి పనులు చేయించలేదని అనడం చాలా సిగ్గుగా ఉంది అన్నారు. రింగ్ రోడ్డు చుట్టూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి లైట్లు వేయడం వల్ల అవి వృథా ఉన్నాయన్నారు. మున్సిపాలిటీ వారి మీద ఆర్ అండ్ బి అధికారులు, ఆర్ అండ్ బి అధికారుల మీద మున్సిపాలిటీ వారు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారన్నారు. గత ప్రభు త్వంలో పాడనిధులతో ఎప్పుడు పూర్తి చేయకూడదని ఆయన ప్రశ్నించారు. మున్సిపాలిటీలో కుక్కల బెడద, పందుల బెడద ఎక్కువగా ఉన్నదన్నారు. కుక్కలను తరలించేందుకు కూడా మున్సిపాలిటీలో డబ్బులు లేకపోవడం చాలా దారుణమైన పరిస్థితి అన్నారు. మున్సిపాలిటీలో ఇంటి పన్నుల విషయంలో చాలా గోల్మాల్ జరుగుతుందని ఆయన అన్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా కూడా వీధిలైట్ల సమస్య ఉందన్నారు. మున్సిపాలిటీలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసు కొస్తే వెంటనే ఆ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు కూడా ఇప్పి ంచేందుకు కృషి చేస్తా అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారంతో జగన్‌పై విషప్రచారం : 'రాచమల్లు'

**ప్రజాశక్తి-ప్రొద్దుటూరు**

కూటమి ప్రభుత్వంతో పాటు పిసిసి ఛీఫ్ షర్మిలమ్మ అబద్దాలతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై విషప్రచారం చేస్తున్నారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాదరెడ్డి తీవ్రంగా విమర్శించారు. వైసిపి నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దున్నపోతు ఈనిందంటే గాటిపాటన కట్టేయి అన్న చందంగా వీరి అబద్దాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. అమెరికా బ్యాంకుల ద్వారా అదాని అనే పారిశ్రామిక వేత్త రూ.2000 కోట్లు అప్పు చేసి చెల్లించని నేపథ్యంలో ఆ బ్యాంకులు అదానిపై కేసు పెట్టిన కేసులో జగన్‌పై అబద్దాలు వల్లెవేయడం తగదన్నారు. అమెరికా పోలీసులు బుధవారం అమెరికా కోర్టుకు ఛార్జ్‌షీట్ దాఖలు చేశాయని, ఆ ఛార్జ్‌షీట్‌లో జగన్ ప్రస్తావనే లేదని తెలిపారు. ఈ విషయం మాజీ అటార్నీ జనరల్ రోహిత్ స్పష్టం చేశారన్నారు. ఆదాని, జగన్‌కు రూ.1750 కోట్లు లంచం ఇచ్చేటప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్, పిసిసి ఛీఫ్ షర్మిలమ్మ, పచ్చపత్రికలు చూసినట్లు అబద్దాలు చెప్పడం తగదన్నారు.

## ఎపిజిబి డిజిటల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

ఆంధ్ర ప్రగతి గ్రామీణబ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని, ఆ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఆర్థిక సాంకేతిక అక్షరాస్యత సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులో అన్ని డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రూపే కార్డ్ సదుపాయం కూడా ఉందని చెప్పారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు ఉన్నా యన్నారు ఏ బ్యాంకు ఖాతాదారుడైన తమ బ్యాంకు వ్యాపార ప్రతినిధి వద్ద ఆధార్ కార్డుతో ఆర్థిక లావాదేవీలు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. ఇలా ఎన్నో ఆకర్షణమైన పథకాలు ఉన్నాయని తెలిపారు. ఖాతాదారుల శ్రేయస్సు తమ ప్రధాన ఉద్దేశం అన్నారు. టర్మ్ డిపాజిట్లపై తమ బ్యాంకు అధిక వడ్డీ అంది స్తుందన్నారు. బ్యాంకులో అగ్రికల్చర్, డైరీ, ఎడ్యుకేషన్, కార్, హౌసింగ్ రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికలజూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మేడా వెంకట గణేష్, అధ్యాపకులు రామచంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అసత్య ఆరోపణలు తగవు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)**

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం తగదని కుతుబుద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యా లయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఎక్కడో కడపలో నిర్వహించిన టెండర్ల విషయంపై ప్రజలలో అపోహలు సృష్టిస్తున్నారన్నారు. అపద్దాలను నిజం చేసే క్రమంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. ఇదే విషయంపై అక్కడి అధికారులు ఫిర్యాదులు ఏమైనా చేశారా అని ప్రశ్నిచారు. టిడిపి నాయకుల గౌరవం ప్రతిష్టను కించపరచాలని చూస్తున్నారన్నారు. అనంతరం టిడిపి నాయకుడు దూదేకుల దస్తగిరి మాట్లాడుతూ వైసిపి వర్గీయులపై టిడిపి నాయకులు దాడి చేశారని ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు అపద్దాల పుట్టా అని అన్నారు. కడపకు 50 వాహనాలతో వైసిపి నాయకులు, టిడిపి నాయకులపై దాడి చేయటానికి వెళ్లారని చెప్పారు. ఇది వాస్తవమా కాదా అన్నారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేయటం మానుకోవాలన్నారు. మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య మాట్లాడుతూ ప్రొద్దుటూరులో కొండారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని అనటం హాస్యాస్పదమన్నారు.

## ఘనంగా అభయ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

**ప్రజాశక్తి - వేముల**

మండలంలోని స్థానిక గొందిపల్లె గ్రామ పంచాయతీ, చిన్న గొంది పల్లెలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను గురువారం ఘనంగా నిర్వహించారు. పుజారులు గడియారం కిరణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో గణపతి ప్రత్యక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవి, వైసిపి మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి , జడ్‌పిటిసి కోగోటం వెంకట భయపు రెడ్డి,ఎక్స్ పొల్యూషన్ బోర్డ్ డైరెక్టర్ మరక శివ కృష్ణారెడ్డి ,గొందిపల్లె సర్పంచ్ నారాయణమ్మ సింగిల్ విండో ఈశ్వరయ్య ,పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఇఒపిఆర్‌డి పద్మావతి , సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా అన్నదానం, కోలాటం, సాసవల చిన్నమ్మ కథ వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

కోలాటం చేస్తున్న చిన్నారులు

## పనులు నాణ్యతగా చేపట్టాలి

**ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె :** ఫారంపండ్ పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపిడిఒ కుళాయిబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక పంచాయతీలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ముందుగా జి. వెంకటలక్ష్మి రైతు పొలంలో జరుగుతున్న ఫారంపండ్ పనులను సందర్శించారు. కూలీలకు పలు సూచనలు, సలహాలిచ్చారు. తరువాత కంది మహేశ్వరి రైతుకు చెందిన పశువుల షెడ్ నిర్మాణాన్ని పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఉపాధి ఎపిఒ బి. రామాంజులరెడ్డి, ఇసి అన్నానాయక్, సాంకేతిక సహాయకులు మహబూబ్‌అలీ, క్షేత్ర సహాయకురాలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాశక్తి - వేముల :** మండల కేంద్రంలోని స్థానిక సబ్ స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతుల కారణంగా వేముల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపువేస్తున్నట్లు జెఇ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అయా గ్రామ ప్రజలు, రైతులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని పేర్కొన్నారు.

## అధిక నష్ట పరిహారం ఇప్పించాలి

**ప్రజాశక్తి - వేంపల్లె :** జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు అధిక నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. గురువారం టిడిపి వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డికి రైతులు ఎక్కువగా నష్ట పరిహారం ఇప్పించాలని టిడిపి నేత శేషారెడ్డి ఆధ్వర్యంలో వినతి అందజేశారు. భూములు ఎక్కువ ధరలకు విక్రయాలు జరుగుతున్నాయాని దానికి తగ్గట్టుగా ప్రభుత్వం నుండి పరిహారం ఇప్పించాలని కోరారు. జాతీయ రహదారిలో భూములు కోల్పోయే రైతులు అందరూ రాజు కాలువ కింద ఉన్న పంట పొలాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. రైతులు నష్ట పోకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ద్వారా సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిహారం ఎక్కువగా వచ్చే విధంగా కృషి చేస్తామని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు.

## అదనపు పని ఒత్తిడి తగ్గించాలి

**ప్రజాశక్తి - చాపాడు :** వివిధ రకాల సర్వేలు, యాప్‌ల పేరుతో అదనపు పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఒ వీర కిషోర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ సాధారణ విధులతో పాటు సచివాలయ నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్నారన్నారు. సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రజలను సమన్వయంతో ముందుకు నడపడంలో పంచాయతీ కార్యదర్శుల బాధ్యత ఎక్కువగా ఉందన్నారు. గ్రామ పంచాయతీలలో ఏ సమస్య వచ్చినా ముందు ఉండాల్సి వస్తుందన్నారు. కొన్ని కార్యక్రమాలకు సొంత డబ్బును ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం జి ఎస్ డబ్ల్యూ ఎస్, విఎస్‌డబ్ల్యూఎస్, పిజిఆర్ఎస్, ఒడిఎఫ్ ,ఈ గ్రామ స్వరాజ్, స్వర్ణ పంచాయతీ వంటి సర్వేలు చేయిస్తూ బాధ్యత పెంచిందన్నారు. పెన్షన్ల పంపిణీ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో అదనపు భారం మోపుతుందన్నారు. గ్రామ పంచాయతీల రిపోర్టులు చేయడంలో ఆలస్యమైతే ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికాక తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలన్నారు.

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KADAPA**
**O.S.No. 343/2023**

Union Bank of India, Rep., by its Branch Manager, Main branch, Sankarapuram, Kadapa.
...Plaintiff
Vs
Danikalla Venkataiah, S/o. Gangaiah, R/o. D. No. 3/991,Chinnachowk, Kadapa City.
...Defendant No.1

**NOTICE**

The above referred the plaintiff bank has filed suit for recovery in O.S No. 343/2023, in the above court and same is posted for your appearance on 25.03.2025, at 10:30 A.M, if you're not appear before the Hon'ble Court, the Hon'ble court will take appropriate steps against you.

//By Order of the Hon'ble Court//
**G.VENKATESWARA REDDY**
Advocate,
KADAPA.

**IN THE COURT OF HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KADAPA**
**O.S.No. 638 /2024**

Union Bank of India, Rept. by its Branch Manager, Sankarapuram, Kadapa.
...Plaintiff
Vs
M/s Sri Ganga Bhavani Enterprises Rep by proprietress 1. K. Mysuramma 2. D. Sreekanth Reddy3. D. Kesava Reddy All are resident of D.No. 1/26-2-1, Chemmumiapeta, Kadapa City.
...Defendants

**NOTICE**

The above referred the plaintiff bank has filed suit for recovery in O.S No. 638/2024, in the above Hon'ble court and same is posted for your appearance on 17.12.2024, at 10:30 A.M, if you're not appear before the Hon'ble Court, the matter will be decide in your absence.

//By Order of the Hon'ble Court//
**G.VENKATESWARA REDDY**
Advocate,
KADAPA.

**మహారాజశ్రీ ప్రదమ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : కడప**
**E.P. No.79 / 2023**
**IN**
**O.S.No.1022 / 2020**

Shaik Abdul Rasheed, Ex-Service Man, S/o. Late Shaik Abdul Rahiman Sab, residing at D. No. 57/9-2, Santhi Nagar, Akkayapalli, Kadapa, YSR District.
...D.Hr/Petitioner/Plaintiff
Vs
1) Shaik Habeeboor Rahiman, S/o. Shaik Allah Bakash, 2) Shaik Parveen, W/o. Shaik Habeeboor Rahiman, Both are R/o. # 57/2, Santhi Nagar, Akkayapalli, Kadapa, YSR District.
...J.Drs/Respondents/Defendants

**వేలం ప్రకటన**

పై దావాలో ప్రతివాదులకు చెందిన 1) 4.5 x 2.5x 16 Almarah (బీరువా) Rs.800/- అంచనా విలువగల, 2) 6.5x2.10x16 Almarah (బీరువా) Rs.1,200/- అంచనా విలువగల, రెండు బీరువాలను పై కోర్టు వారు, కోర్టు నందు 13.12.2024వ తేదీ ఉదయం 10.30 గంట లకు వేలము వేయుదురు. వేలము నందు పలుగోనదలచిన వారు ఆధర్ కార్డుతో హాజరై 13.12.2024 వ తేదీ ఉద యం 10.30 గంటలకు వేలము నందు పాలుగోనవచ్చును.
తేది: 13.12.2024

//By Order of the Court//
బి.భాస్కర్
వాది తరపు అడ్వకేట్,
కడప.

**IN THE COURT OF THE HON'BLE IVTH ADDL JUNIOR CIVIL JUDGE, KADAPA**
**O.S.No. 1055/2023**

Rayalaseema Grameena Bank, Now called as AP Grameena Bank, Represented by its Branch manager, Mochempeta Branch, Kadapa District.
...Plaintiff
Vs
1. Shaik Allabakash S/o Shaik Mahaboob Basha, Muslim, Business, aged about 60 years, Residing at DNo; 9/498, Agadi street, Kadapa city, YSR Kadapa District.
2. Shaik Khaja Mohiddin S/o Shaik Mahaboob Saheb, Muslim, Business, aged about 58 years, Residing at DNo; 1/231, Saibaba Nagar, Chemmumiyapeta, Kadapa city, YSR Kadapa District.
...Defendants No: 1&2

**NOTICE**

Please take this notice that the above suit filed by the plaintiff bank for recovery of the suit amount against No:1 and 2 of you stands posted on 03-12-2024 for appearance of No:1 &2 of you before the Hon'ble court at 10.30 AM either by yourself or through your advocate failing which the matter will be decided in your absence.

**A.RAJA REDDY**
Advocate for the Plaintiff